టిటిడి బోర్డు సభ్యుల నియామకాలను సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్

తిరుపతి బ్యూరో : తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పాలకమండలి సభ్యుల నియామకాలను సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. నేరచరిత్ర, లిక్కర్ వ్యాపారాలు చేస్తున్న వారిని టిటిడి బోర్డు సభ్యులుగా నియమించడం సరి కాదని చింతా వెంకటేశ్వర్లు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు.. సభ్యులుగా ఎన్నికైన ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, కేతన్ దేశాయ్, శరత్ చంద్రారెడ్డి నియామకాలను ఆయన సవాల్ చేశారు. ఈ ముగ్గురిని తితిదే బోర్డు సభ్యులుగా తొలగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశం కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలతో ముడిపడి ఉందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు..

ప్రతి ఇంట్లో విద్యావంతులు ఉండాలి

- రూ.680.44 కోట్లు విద్యాదీవెన లబ్ధి
- నగరిలో బటన్ నొక్కి జమచేసిన సిఎం

ప్రజాశక్తి - నగరి

'చదువుతోనే ఆత్మవిశ్వాసంతో బతకొచ్చు... పిల్లల జీవితాన్ని మార్చేది విద్య మాత్రమే..అందుకే చదువు ప్రతి కుటుంబానికీ, ప్రతి పిల్లవానికి అందాలి... అప్పుల పాలయ్యే పరిస్థితి తల్లిదండ్రులకు రాకూడదు..అందుకే పిల్లలకు అయ్యే ఫీజులను వందశాతం రీయింబర్స్ చేస్తూ తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.. ప్రతి ఇంట్లో విద్యావంతులు ఉండాలనేదే నా లక్ష్యం' అని సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. క్రమం తప్పకుండా ఏప్రిల్- జూన్ 2023 త్రైమాసికానికి 9,32,235 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ 8,44,336మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగరి వేదికగా సిఎం జగన్మోహన్‌రెడ్డి బటన్‌నొక్కారు. పుత్తూరు- నగరి మార్గమధ్యంలో షిర్డీసాయి దివ్యధామం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగసభ వేదికపై మాట్లాడుతూ వందశాతం పూర్తి ఫీజును ప్రతి మూడు నెలలకోసారి రీయింబర్స్ చేస్తున్నామన్నారు.



పలు శంకుస్థాపనలు

ఈ కార్యక్రమంలో భాగంగా రూ.5.40 కోట్లతో నగరి లో 100 పడకల వైద్య విధాన పరిషత్ ప్రాంతీయ వైద్యశాల పునరుద్ధరణ పనులు, రూ.7.25 కోట్లతో సమీకత గిరిజనాభివద్ధి సంస్థ (యానాదులు), నెల్లూరు ఆధ్వర్యంలో పుత్తూరు లోని నందిమంగలం వద్ద ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర) శాశ్వత భవన నిర్మాణానికి, రూ.1.89 కోట్లతో నగరి పోలీస్ స్టేషన్ శాశ్వత భవన నిర్మాణానికి సభా వేదిక వద్ద ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కె. నారాయణ స్వామి, జిల్లా ఇంఛార్జి మంత్రి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషా శ్రీ చరణ్, రాష్ట్ర అటవీ,విద్యుత్, పర్యావరణ శాస్త్ర సాంకేతిక భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజంపేట, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిధున్ రెడ్డి, ఎన్. రెడ్డప్ప, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ ఎస్.షన్మోహన్, జేసీ పి.శ్రీనివాసులు, డిఆర్ఒ ఎన్.రాజశేఖర్ పాల్గొన్నారు.

జిల్లాలో రూ.29.23 కోట్లు లబ్ధి

తిరుపతి టౌన్ : పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు అనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. చిత్తూరు జిల్లా నగరి బహిరంగ సభా వేదిక నుండి మూడవ త్రైమాసికం (ఏప్రిల్ 23 - జూన్23) కు చెందిన ఫీజు రీయింబర్స్మెంట్ ఆర్థిక సాయాన్ని 9,32,235 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ. 680.44 కోట్లను కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా అర్హులైన 8,44,336 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేశారు. తిరుపతి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాట్లు చేయగా జిల్లా జెసి, ఎంయల్‌సి కళ్యాణ చక్రవర్తి, వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని సి.ఎం సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మూడవ త్రైమాసికం (ఏప్రిల్ 23 - జూన్23) జగనన్న విద్యా దీవెన ఆర్థిక సాయాన్ని జిల్లాలో 38,960 మంది విద్యార్థులకు చెందిన 35312 మంది తల్లుల ఖాతాలకు సుమారు రూ. 29.23 కోట్లు జమ చేశామన్నారు. అనంతరం విద్యా దీవెన కింద రూ. 29.23 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ మెగా చెక్ ను విద్యార్థులకు వారి తల్లులకు అందచేశారు.

ఘనంగా స్వాగతం

రేణిగుంట విమానాశ్రయానికి 9.53 గంటలకు చేరుకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిరాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం 10.10 గంటలకు చిత్తూరు జిల్లా నగరి కీలపట్టుకు హెలిప్యాడ్‌కు వెళ్లారు.

జగనన్నకు చెప్పకున్నాం..రశీదు పొందాం..!

నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జగనన్నకు డైరెక్టుగా చెప్పుకున్నామని సిపిఐ, సిపిఎం నాయకులు డి.మహేష్, వెంకటేష్ పేర్కొన్నారు. నగరిలో జరుగుతున్న సభ వద్ద 'జగనన్నకు చెబుదాం'కౌంటర్‌లో అర్జీ సమర్పించి రశీదు పొందారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మున్సిపల్ శానిటేషన్ కార్మికులకు 25వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వంద పడకలకు స్థాయి పెంచాలన్నారు. గాజులమండ్యం, నింద్ర మండలాల్లోని సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని, చేనేత కార్మికులకు కరెంట్ ఛార్జీలు తగ్గించాలన్నారు. వేణుగోపాలపురం, గాలేరు-నగరి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.

సిఎం సాక్షిగా బయటపడిన గ్రూపులు

జగన్మోహన్‌రెడ్డి సాక్షిగా కలవని చేతులు

నగరి: సిఎం జగన్మోహన్‌రెడ్డి సాక్షిగా మరోసారి నగరి నియోజకవర్గం రోజా ఇలాకాలో గ్రూపులు బయటపడ్డాయి. అసంతృప్తి జ్వాల ఏ స్థాయిలో ఉందంటే సిఎం పర్యటనకు ఏర్పాటు చేసిన బ్యానర్లో వ్యతిరేకవర్గీయులు ఆర్‌కె రోజా ఫొటోను ముద్రించనంత. సిఎం జగన్మోహన్‌రెడ్డే స్వయంగా ఈడిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కెజె శాంతి చేతిని మంత్రి ఆర్‌కె రోజా చేతిలో కలపాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సున్నితంగా తిరస్కరించడం గమనార్హం. ఈ సన్నివేశం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమయ్యింది. మంత్రి రోజాకు వచ్చే ఎన్నికల్లో వైసిపి టికెట్ ఇవ్వరాదని, స్థానికులకే ఇవ్వాలని సిఎం సభ అనంతరం నియోజకవర్గంలోని వడమాలపేట, నగరి, నింద్ర, పుత్తూరు, విజయపురం మండలాల వైసిపి సీనియర్ నాయకులు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి తీర్మానం చేయడమూ చర్చనీయాంశమయ్యింది. గత యేడాది మంత్రి రోజాను వ్యతిరేకిస్తున్న వైసీపీ మండల ఇంచార్జుల్లో నగరి మాజీ మున్సిపల్ చైర్మన్ కేజే కుమార్ దంపతులు, వడమాలపేట మండల వైసీపీ ఇంచార్జి మురళీధర్ రెడ్డి, నింద్ర ఇంచార్జి చక్రపాణి రెడ్డి, పుత్తూరు ఇంచార్జి అములు, విజయపురం మండలం లక్ష్మీపతి రాజు లు మంత్రి రోజాను వ్యతిరేకిస్తూ సీఎంకు వినతిపత్రాన్ని అందించారు. అంతే కాకుండా గతంలో వీరు సీఎంను కలిసి వచ్చే ఎన్నికల్లో మంత్రి రోజాకు ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వరాదని, మంత్రి నిజమైన వైసీపీ నేతలను కేవలంగా చూస్తూ టీడీపీ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏదిఏమైనా సిఎం సాక్షిగానూ గ్రూపుల జ్వాల ఆరనేలేదు.

బషీర్‌బాగ్ ఉద్యమస్ఫూర్తితో...

విద్యుత్ ఛార్జీల భారంపై మరో పోరాటం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో జరిగిన పోరాటంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో అమరులైన బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణలకు జిల్లావ్యాప్తంగా నివాళి అర్పించారు. తిరుపతి యశోదానగర్‌లోని సిపిఎం, సిపిఐ కార్యాలయంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు హయాంలో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలు మోపారన్నారు. అప్పట్లో హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రాంతంలో పది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన మిలిటెంట్ పోరాటాల్లో పోలీసులు ప్రజలపై టియర్‌గ్యాస్, లాఠీఛార్జీలు, ముళ్లకంచెలు వేయడమే గాకుండా కాల్పులు జరిపారన్నారు. ఈ పోరాటంలో ముగ్గురు అమరులయ్యారని, అనేకమంది తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి మాట్లాడుతూ ఆనాటి పోరాట స్ఫూర్తితో ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకరంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్నారు. బషీర్‌బాగ్‌లో జరిపిన పోరాట ఫలితంగా దాదాపు 20 ఏళ్లపాటు విద్యుత్ సంస్కరణలకు దూరంగా ప్రభుత్వాలు వ్యవహరించాయన్నారు. మళ్లీ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అదే సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలపై ట్రూప్ అప్ ఛార్జీల పేరుతో భారాలు మోపుతున్నారన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తున్న విధానాన్ని కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను అమలు చేయడంలో జగన్మోహన్‌రెడ్డి ముందున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, నాయకులు మాధవ్, జయచంద్ర, సాయిలక్ష్మి, పి.హేమలత, జి.బాలసుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, మునిరాజా, వివేక్ మణ్యం, పద్మ, కె.రాధాక్రిష్ణ, విశ్వనాధ్, మంజుల, నదియా, శివ పాల్గొన్నారు.

రేణిగుంటలో... కరెంట్ ఆఫీసు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.హరినాధ్, శివానందం, మహిళా సంఘం మండల కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు రైతులు, పేద మధ్యతరగతి ప్రజలపై ఛార్జీల భారాన్ని మోపుతున్నాయన్నారు. సెప్టెంబర్ 1న వార్డు, గ్రామ సచివాలయాల వద్ద విద్యుత్ బిల్లులను దగ్ధం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒ.వెంకటరమణ, ఎంపిటిసి రాజేశ్వరి, నాయకులు ఈశ్వరమ్మ, సత్యశ్రీ, దిలీప్‌బాషా, నరసింహారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో... సిపిఎం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నాయకులు జోగి శివకుమార్, సురేష్, అడపాల ప్రసాద్, ధనమ్మ పాల్గొన్నారు. సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

శ్రీకాళహస్తిలో... సిపిఎం నాయకులు గంధం మణి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడేలా మీటర్లు తెస్తుందన్నారు. చంద్రబాబుకు ఏమీ తీసిపోనట్లుగా జగన్ పాలన ఉందని ఎద్దేవా చేశారు. గురవయ్య, రాజా పాల్గొన్నారు.

'ఆపరేషన్ చిరుత' సక్సెస్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

భక్తుల ప్రాణాలు కాపాడటానికి తీసుకన్న చర్యల్లో భాగంగా ఆపరేషన్ చిరుత సక్సెస్ అయ్యిందని, నడకమార్గంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా గుంపులు గుంపులుగా వెళ్లాలని సిసిఎఫ్ నాగేశ్వరరావు తెలిపారు. టిటిడి, అటవీశాఖ సమన్వయంతో నాలుగు చిరుతలను బంధించామన్నారు. జూన్ 24న ఒకటి, ఆగస్టు 14, 17, 28 తేదీల్లో మరో మూడు చిరుతలను బంధించి జూపార్కుకు తరలించామన్నారు. ఇకపై నిరంతరం 200 కెమెరా ట్రాప్‌ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని, వందమంది అటవీ సిబ్బంది పహారా కాస్తారని తెలిపారు. భక్తుల భద్రతే ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, అటవీ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. సీ సీ ఎఫ్ నాగేశ్వరరావు పర్యవేక్షణ లో తిరుపతి డీ ఎఫ్ వో సతీష్ రెడ్డి, టీ టీ డీ డీ ఎఫ్ వో శ్రీనివాసులు నేతత్వం లో సిబ్బంది సమన్వయం తో కలిసి ముందుకు పోతున్నారు. నడక మార్గంలో సంచరిస్తున్న చిరుత లు నాలుగింటిని బందించినా , ఇతర క్రూర మగాల నుంచి భక్తులకు రక్షణ కోసం నిరంతర. పహారా ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం పట్టుకున్న నాలుగు చిరుత లలో ఒక దానిని. అటవీ ప్రాంతంలో వదిలివేయడం జరిగిందని, మిగతా మూడు చిరుత లను. తిరుపతి జూ పార్క్ లో ప్రస్తుతానికి ఉంచామని సీ సీ ఎఫ్ నాగేశ్వరరావు వెల్లడించారు. అదేవిధంగా నడక మార్గంలో నడిచే సమయంలో భక్తులు గుంపులుగా. వెళ్ళాలని ఆయన సూచించారు.

సీఎం సమక్షంలోనే నగరిలో గ్రూపులు : జనసేన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సొంత నియోజకవర్గంలోనే అసమ్మతి వర్గాలు సాక్షాత్తు సీఎం సమక్షంలోనే భగ్గుమన్నాయని, సీఎం జగన్ కలుగజేసుకొని కేజే శాంతి, మంత్రి రోజాలను కలపడానికి ప్రయత్నించడం చూస్తుంటే ఈసారి రోజాకు నగిరి టికెట్టు లేనట్టేనని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ ఇన్చార్జి కిరణ్ రాయల్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినిమా పరిశ్రమ నుండి రాజకీయాల్లోకి వచ్చిన రోజాకు అదే సినిమా పరిశ్రమకు చెందిన వారంటే ఇందుకు చిన్న చూపు చూస్తున్నారు అని ప్రశ్నించారు. మంత్రి రోజా సొంత నియోజకవర్గం నగిరిలో సీఎం వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లలో రోజా ఫోటోలు ఏర్పాటు చేయలేదంటే అక్కడ నాయకులు గాని, ప్రజలు గాని రోజా పట్ల ఎంత అసంతప్తితో ఉన్నారో బట్టబయలైందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తిరుపతి పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, నాయకులు హేమంత్ కుమార్, పాల్గొన్నారు.

తెలుగుభాష మాధుర్యాన్ని చాటాలి

ప్రజాశక్తి - క్యాంపస్, యంత్రాంగం

తెలుగుభాష గొప్పతనాన్ని, మాధుర్యాన్ని చాటి చెప్పాలని వక్తలు ఉద్ఘాటించారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకుని ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ జక్కంపూడి మునిరత్నం శ్రావ్యంగా పద్యాలు పాడారు. నన్నయ్య నుంచి నేటి వరకూ తెలుగు సాహిత్యాన్ని వివరించారు. అమ్మభాష తెలుగు భాషన్నారు. ఉపాధి కోసం ఇతర భాషలు నేర్చుకున్నా తెలుగును మరచిపోరాదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి సత్యనారాయణ, డాక్టర్ భీమన్న, లోకనాధ మందడి,

వెంకటేశ్వర్లు, ప్రసాద రావు, తేజోవాణి పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగలో... కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో వారం రోజులుగా వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలను తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి నిర్వహించారు. విద్యార్థులను సోమవారం తెలుగు కవుల పేరుతో బృందాలుగా విభజించి క్విజ్ పోటీలను నిర్వహించారు.

పుత్తూరు టౌన్... చిన్నప్పటి నుంచి తెలుగు భాషపై మమకారం పెంచుకోవాలని ఉపాధ్యాయుడు రంగయ్య పేర్కొన్నారు. ఎంపియుపి పాఠశాలలో చిత్రలేఖనం, కవితలు రాయడంపై పోటీలను నిర్వహించారు. మంగళవారం బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నానో ఎరువులతో పెట్టుబడి తగ్గింపు

ప్రజాశక్తి - బాలాయపల్లి

పంటలకు నానో, జీవన ఎరువుల వాడకంతో సాగు ఖర్చులు తగ్గి రైతులకు అధిక ఆధాయం వస్తుందని వ్యవసాయ శాఖ తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఏ డి ఏ భాస్కరయ్య తెలిపారు. బాలాయపల్లి మండలం, నిడిగల్లు గ్రామంలో 'ఆత్మ' సహకారంతో ఏర్పాటుచేసిన రైతు శిక్షణలో ఆయన మాట్లాడారు. రైతులు భూములకు వేసే ఎరువులలో 20 నుండి 30 శాతం మాత్రమే పంటలు వినియోగించుకుంటాయని తెలిపారు. మిగతా భూమి లోపలి పొరల్లో, వాతావరణంలో కలిసిపోయి, నేలలను, భూగర్భ జలాలను, వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్నదని వివరించారు. ఈసమస్య నివారణకు నానో ఎరువులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ద్రవ రూపంలో ఉండే ఈ ఎరువులు అర్థ లీటరు ఒక బస్తా ఎరువుకు సమానమని తెలిపారు. వీటిని పైరు పై స్ప్రే చేసినప్పుడు, పోషకాల వినియోగశాతం అధికంగా ఉండి, ఎరువుల వధా తగ్గి, రైతుకు అధిక ఆదాయం వస్తుందని చెప్పారు.

'ఇఫ్కో' జిల్లా మేనేజరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇఫ్కో సంస్థ సహకార రంగంలో అతిపెద్ద ఎరువుల ఉత్పత్తి సంస్థ అని చెప్పారు. రైతుల బాగుకోసం, ప్రపంచంలోనే మొదటిసారి నానో ఎరువులను తయారుచేసి రైతులకు అందిస్తున్నామని చెప్పారు. నాణ్యమైన నానో ఎరువులతోపాటు, జీవన ఎరువులను కూడా రైతులకు ఇఫ్కో అందిస్తున్నదని వివరించారు. రాబోవు రభీ వరి సాగు పద్ధతుల గురించి ఏఓ వేణుగోపాలరావు రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ పథకాల గురించి మండల వ్యవసాయ అధికారిని శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి సబ్ డివిజన్ టెక్నికల్ ఏవో వరప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి సుధాకర్, ఎంపీటీసీ దశరథరామిరెడ్డి, సర్పంచ్ రాఘవరెడ్డి, ఆర్.బి.కె వ్యవసాయ సహాయకురాలు సుమతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

బిఎన్ కండ్రిగ : మండలంలోని కుక్కంబాకం రెవెన్యూలో ఉన్న ప్రభుత్వ భూమిలోకి ఎవ్వరు ప్రవేశించకూడదని, ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డును సోమవారం తహసీల్దారు భార్గవి ఏర్పాటు చేయించారు. సర్వే నెంబరు 81 లో ఎటువంటి అనుమతులు లేకండా ఆక్రమణ. సాగు చేయరాదన్నారు.

బిఎస్ఎన్ఎల్‌లో ఉచిత 4జి అప్‌గ్రేడ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

భారత కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల ప్రకారము, ఒకవేళ తన సిమ్ ను పేపర్ అప్లికేషన్ ద్వారా పొంది ఉన్నట్లైతే, ఆ వినియోగదారుడు వెంటనే కేవైసీ ద్వారా డిజిటలైజ్ చేసుకోవలని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సీఏ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. పేపర్ అప్లికేషన్ ద్వారా సిమ్ ను పొంది ఉన్న వినియోగదారులు, సమీపములో ఉన్న బి.ఎస్.ఎన్.ఎల్. వినియోగదారుల సేవా కేంద్రం లేదా ఫ్రాంచైజీ, రిటైలర్ ను తమ ఆధార్ రికార్డ్ తో సందర్శించి సెప్టెంబర్ నెల 30 తేదీ లోగ కేవైసీ డిజిటలైజ్ చేయించుకోవాలని సూచించారు. తమ మొబైల్ ఫోన్ లో ఉన్న ప్రస్తుత సీమ్ 3 జి లేదా 4 జి అని తెలుసుకోవడం కోసము తన మొబైల్ నుంచి సిమ్ టైప్ చేసి 9441299999 కు మెసేజ్ పంపి, వెంటనే తెలుసుకోవాలని కోరారు. 4జిగా మార్చుకుని నిరంతరాయ సేవలు పొందాలని కోరారు.

వార్డు స్థాయిలో పొలిటికల్ 'వార్'

వైసిపి వాలంటీర్లు X టిడిపి గృహసారథులు

ఇప్పటినుంచే ప్రతి ఇంటికీ ఎన్నికల 'సైన్యం'

వైసిపి, టిడిపి అధినేతల కసరత్తు..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల రాజకీయం మొదలయ్యింది. గెలుపు కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. ప్రతి ఇంటికీ తమ సైన్యం వెళ్లేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు.

వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటితోనూ ప్రభుత్వానికి సంబంధాలు ఏర్పడ్డాయి. లబ్దిదారులే తమ ఓటు బ్యాంకుగా వైసిపి భావిస్తోంది. ఇపుడు వీరికి పోటీగా టిడిపి కుటుంబ సారథుల పేరుతో తమ సైన్యాన్ని రంగంలోకి దించుతోంది. దీంతో గడప దగ్గరే అసలు సిసలైన ఎన్నికల 'వార్' మొదలయ్యింది.

ఎపిలో ఎలాగైనా అధికారం నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం. జగన్‌ను ఓడించి అధికారం చేపట్టాలన్నది టిడిపి అధినేత చంద్రబాబు టార్గెట్. ఇందుకోసం చంద్రబాబు జనసేనాని పవన్‌తో పొత్తు దాదాపు ఖరారు చేసుకున్నారు. ఆ ఇద్దరితో బిజెపి కలిసి వస్తుందా? లేదా అన్నది తెలియాలంటే మరికొంత సమయం ఆగాల్సిందే. ప్రస్తుతం మాత్రం బిజెపి అధికార, ప్రతిపక్షాలిద్దరితోనూ దోబూచులాడుతోంది. ఇదే సమయంలో సీఎం జగన్ నమ్ముకున్న సంక్షేమ ఓట్ బ్యాంకుకు కౌంటర్ గా చంద్రబాబు మహానాడు వేదికగా సంక్షేమ మేనిఫెస్టోను ప్రకటించారు. కానీ ఆ మేనిఫెస్టోకు ప్రజల నుంచి ఆశించిన స్పందన కనిపించలేదు. దీంతో ఇప్పుడు వైసీపీ పథకాలను ఇంటింటికి అందిస్తున్న వాలంటీర్లకు పోటీగా కుటుంబ సారధులను రంగంలోకి దించి తన మేనిఫెస్టోను ప్రతి ఇంటికి చేరువ చేయాలనేది చంద్రబాబు తాజా ఆలోచన. అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ ఇన్‌ఛార్జిలు కసరత్తు చేస్తున్నారు. అక్టోబర్ రెండో తేదీ నుంచి వీరందరికీ బాధ్యతలు కేటాయించనున్నారు. టీడీపీ ప్రకటించిన సంక్షేమ మేనిఫెస్టోను 'టీడీపీ సూపర్ సిక్స్ ఇది బాబు గ్యారెంటీ స్కీం' పేరుతో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వీరికి శిక్షణ ఇవ్వనున్నారు.

ముఖ్యమంత్రి జగన్ తన పథకాల అమలులో ప్రధానంగా మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతి పథకంలోనూ మహిళలను లబ్ధిదారులుగా గుర్తించారు. అమ్మఒడి మొదలు ఇంటి స్థలాల వరకు అన్ని మహిళల పేరు మీదే పంపిణీ చేస్తున్నారు. మహిళా ఓట్ బ్యాంకును సుస్థిరం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు దీనికి పోటీగా చంద్రబాబు సైతం మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు మహాశక్తి

పేరుతో కొత్త పథకాలను ప్రకటించారు. 18 ఏళ్ల వయసు దాటిన ప్రతి మహిళకు ఆర్థికంగా చేయూతనివ్వటంతో పాటుగా , మహిళలకు జిల్లాల్లో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందిస్తామని ప్రకటించారు. ప్రతి ఇంటికి రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సారథులను ఎంచుకున్న చంద్రబాబు వారి ద్వారా వాలంటీర్ వ్యవస్థకు పోటీగా కొత్త వ్యవస్థను రంగంలోకి దించుతున్నారు. ఎన్నికల్లోగా టీడీపీ సారథులు ప్రతి ఇంటి తోను సంబంధాలు పెంచుకొని వైసీపీ కంటే మెరుగైన సంక్షేమం అందిస్తామని ప్రచారం చేస్తూ టీడీపీకి అనుకూలంగా వారిని మలుచుకునేందుకు ప్రయత్నాలు చేయటమే వీరి నియామకం వెనుక అసలు ఉద్దేశం గా తెలుస్తోంది.

ఈసారి ఎన్నికలు పూర్తిగా సంక్షేమ ఓట్ బ్యాంక్ ఆధారంగానే జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇప్పుడు టీడీపీ కూడా కుటుంబ సారుథుల పేరుతో తమ సైన్యాన్ని రంగంలోకి దించటంతో ఇక క్షేత్రస్థాయిలో వాలంటీర్లు వర్సెస్ టీడీపీ గహసారథులు అన్నట్లుగా వార్డు స్థాయిలోనే పొలిటికల్ వార్ మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి...!!

త్వరితగతిన ఏర్పేడు కాంప్లెక్స్ నిర్మాణాలు

ఏర్పేడు : మండల కేంద్రమైన ఏర్పేడులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అధ్యక్షతన పనులు జోరుగా సాగుతున్నాయి. 11 అంగడి దుకాణాలకు సుమారు 57 లక్షల రూపాయలతో ఈ పనులు చురుగ్గా చేస్తున్నారు. బుధవారం ఈ దుకాణాలకు స్లాబ్ పనులు చేసే నిమిత్తం పి ఆర్ డి ఈ ఎన్ ఆర్ రాజశేఖర్ పనులను పరిశీలించారు. నిర్మాణం చురుగ్గా సాగుతుండడం పట్ల డి.ఈ సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివచంద్ర, ఆమందూరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆరాసి కిరణ్ పాల్గొన్నారు.

సిఐటియు మండల కన్వీనర్‌గా గండికోట నాగవెంకటేష్

క్యాంపస్ : తిరుపతి రూరల్ సిఐటియు మండల కన్వీనర్ గా గండికోట నాగవెంకటేష్ ఎన్నికైనట్టు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి ఎస్వీనగర్ నందు గల నల్లగంగమ్మ గుడి ఆవరణ నందు సిఐటియు మండల మహాసభ జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా నాయకులు జయచంద్ర, ఐద్వా జిల్లాకార్యదర్శి డాక్టర్ పి. సాయిలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ, ఆప్కాస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చినబాబు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పుత్తూరు టౌన్ : మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి ఇందిరమ్మ తెలిపారు. మునివేలమ్మ అధ్యక్షతన సమావేశం జరగనుంది.

ఎస్వీయూలో ఘనంగా సుమన్ జన్మదిన వేడుకలు

క్యాంపస్ : ప్రముఖ సినీ నటుడు తల్వార్ సుమన్ జన్మదిన వేడుకలను ఎస్వీ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద సుమన్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా నికిత హాస్టల్ నిర్వాహకులు చిన్ని రాయల్ విచ్చేశారు.

సిహెచ్‌సిని సందర్శించిన కమిటీ ఛైర్మన్

నాయుడుపేట : నాయుడుపేట లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను కమిటీ వైస్ చైర్మన్ చేవూరు చెంగయ్య సోమవారం ఉదయం కొంతమంది వైసీపీ నాయకులతో కలిసి సందర్శించారు అక్కడ పరిస్థితులను డాక్టర్ చంద్రకళను అడిగి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. రోగులు పట్ల వారు చూపుతున్న శ్రద్ధకు సంతోషం వ్యక్తం చేశారు. డాక్టర్ చంద్రకళ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా వచ్చాక అనేక మార్పులు చేశారని, రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ హాస్పిటల్‌కు కావాల్సిన అన్ని పరికరాలు అమర్చుకుంటున్నారని రోగులకు మరింత సేవలందించేందుకు హాస్పిటల్ కమిటీ చైర్మన్ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దష్టికి తీసుకెళ్లి ఆమెకి అన్ని విధాల సహకరిస్తామని అన్నారు. ఎమ్మెల్యే కిలివేట్ సంజీవయ్య అండదండలతో హాస్పిటల్ అభివద్ధికి ఎంతగానో కషి చేస్తున్నానని అలాగే సదరన్ క్యాంపు ల ద్వారా 3వేల మంది వికలాంగులకు పరీక్షల నిర్వహించి ఎంతోమంది దివ్యాంగులకు ఆర్థికంగా సహాయపడ్డామని తెలియజేశారు. 50 పడకలకు తీసుకెళ్లేందుకు కషి చేస్తామని చెంగయ్య డాక్టర్ కు హామీ ఇచ్చారు ఆయనతోపాటు వైసిపి నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కటకం జయరామయ్య, డాక్టర్లు రూప, అమర్ నాద్, నవీన్, సాయి ప్రియ, వెంకటరత్నం ఉన్నారు.

అంగన్‌వాడీ భవనం... ఏడేళ్లుగా పిల్లర్లకే పరిమితం

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

మండలంలోని కాపాళెం దళితవాడలో ఏడేళ్లుగా పిల్లర్లకే అంగనవాడీ భవనం పరిమితమయ్యింది. గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వంలో అంగనవాడీ భవనం మంజూరు అయిక్యంది. కాంట్రాక్టర్ పిల్లర్లను వేసి భవనానికి వేసిన అంచనాలు తక్కువగా ఉండటంతో పనులు ఆపేశారు. అప్పటి నుంచి భవనం లేక చిన్న అద్దె భవనంలో పాఠశాల నడుస్తోంది. భనవం సకాలంలో నిర్మించకపోవడంతో భవనానికి కేటాయించిన నిధులు రద్దు అయ్యాయి. అ భవనం నిర్మించాలని ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు అడుగుతున్నా పట్టించుకోవడం లేదని దళితులు వాపోతున్నారు. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే స్పందించి అంగనవాడీ భవనం మంజూరు చేయాలని కోరుతున్నారు.

రాష్ట్ర టెన్నిస్ పోటీల్లో అన్నదమ్ముల హవా..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలలో శ్రీకాళహస్తి విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ఈ పోటీలలో అండర్-14, అండర్-16 విభాగంలో అన్నదమ్ములు విజేతలుగా నిలిచి అరుదైన ఘనతను సాధించారు. గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంటు అండర్-12, అండర్-14, అండర్-16 బాలబాలికల విభాగంలో జరిగింది. ఈ టోర్నమెంట్ లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన అన్నదమ్ములు బి.కరుణ్ కుమార్, బి.జయసాయి కుమార్ లతోపాటు, సీహెచ్ చైతన్యశ్రీ లు పాల్గొన్నారు. అండర్-16 బాలుర విభాగంలో జరిగిన పోటీలలో కరుణ్ కుమార్

ఉత్తమ ప్రతిభ కనభరచి విన్నర్ గా నిలిచాడు. అతని తమ్ముడు జయసాయి కుమార్ అండర్-14 బాలుర విభాగంలో తన ప్రతిభతో విజయకేతనం ఎగురవేశాడు. అలాగే సీహెచ్ చైతన్య శ్రీ అండర్-16 బాలికల విభాగంలో రన్నర్ గా నిలిచింది. ఈ ముగ్గురు క్రీడాకారులు శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని క్లాసిక్ టెన్నిస్ అకాడమిలో కోచ్ మునికష్ణారెడ్డి వద్ద శిక్షణ తీసుకుంటూ ఉన్నారు. కరుణ్ కుమార్ స్థానిక విక్రమ్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం, జయసాయి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి, చైతన్య శ్రీ రత్నం పాఠశాలలో చదువుతోంది. ప్రస్తుతం జరిగిన ఏపీ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంటులో తమ ప్రతిభతో విజయం సాధించి బహుమతులను సొంతం చేసుకోవడం పట్ల ఆయా విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులతోపాటు కోచ్ మునికష్ణారెడ్డి ఆ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయిలో మహిళా వర్సిటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ :

ఎపి రాష్ట్ర సీనియర్ క్యోరుగి, 12వ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ 39 ప్రమోట్ చేయబడిందని ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జి. సారా స రో జి ని వెల్లడించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులు వివిధ వెయిట్ విభాగాల్లో పాల్గొని 4 విభాగాల్లో పతకాలు సాధించారు. ఉపకులపతి ఆచార్య డి. భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ అనురాధ, ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జి.సారాసరోజిని, కోచ్ సి.రమణన్ , ఇతర సిబ్బంది విజేతలను అభినందించారు. వివిధ విభాగాలలో విజేతలు స్టేట్ మీట్‌లో గోల్డ్ మెడల్ సాధించి, నేషనల్స్‌కి ఎంపికైన చెరిష్మాను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆమె 9 నుండి 11 సెప్టెంబర్ 2023 వరకు గోహతిలో అస్సాం స్టేట్ టైక్వాండో అసోసియేషన్ నిర్వహించే జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొంటుంది.

ముగిసిన టీచర్స్ క్రికెట్ లీగ్

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

పట్టణంలోని అల్లూరు అదిశేషా రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ -5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గత మూడు రోజులుగా ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా బాలయపల్లి జట్టు , రన్నర్ గా వాకాడు జట్టు నిలిచాయి. అనంతరం క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్ర శేఖర్ , బాబు ఆగస్టస్ కార్యవర్గ సభ్యులు పురందర్ రాజు,ప్రభాకర్, పి.డి.కరిముల్లా పాల్గొన్నారు.

ఆర్డీవో గారూ... పట్టాలిప్పించండి..! : సిపిఎం

ప్రజాశక్తి -గూడూరు

'భూములు కేటాయించారని.. అయితే పట్టాలివ్వలేదని.. ఆర్డీవో గారు స్పందించి పట్టాలివ్వాలి' అని సిపిఎం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహిళలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ అశోక్‌నగర్ అంబేద్కర్‌నగర్ వాస్తవ్యులు 21 మంది మహిళలకు సిజెఎఫ్ఎస్ భూములు కేటాయించారని, వాటిని రీసర్వే పెట్టి పట్టాలివ్వాలని 2004 నుంచి అడుగుతున్నా పట్టించుకోలేదన్నారు. కోఆపరేటివ్ ఫార్మింగ్ సొసైటీ కింద ఎకరా 50 సెంట్లు లెక్కన మంజూరు చేశారని, 2019లో పట్టాలు చేస్తామని చెప్పి మా దగ్గర సాగు అనుభవాలు అన్ని ఆధారాలు తీసుకున్నారన్నారు. కొంతమందికి చేసి, 21 మందికి ఆపేశారని, అదేమని అడిగితే ఎన్నికల కోడ్ ఉందని చెప్పారని, అప్పటినుంచి తిరుగుతూనే ఉన్నామన్నారు. గూడూరు ఆర్డీవో స్పందించి పట్టాలు ఇప్పించి ఆదుకోవాలని దళిత మహిళలు కోరుతున్నారు. బివి రమణయ్య, కార్యదర్శి ఎస్.సురేష్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్వీ ఆయుర్వేద వైద్య విద్యార్థికి జేఈవో అభినందన

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆయుర్వేద పరిశోధనలో ప్రతిభ కనబరిచిన ఎస్వీ ఆయుర్వేద వైద్య కళాశాల విద్యార్థి ఎన్.శ్రీకర్ భరద్వాజను టీటీడీ జేఈవో సదా భార్గవి సోమవారం తమ కార్యాలయంలో అభినందించారు. ఆయుర్వేద వైద్యశాస్త్రంలో భారతదేశంలోనే ఉన్నత పరిశోధనా సంస్థ అయిన న్యూఢిల్లీలోని సిసిఆర్ఎఎస్(సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చి ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్) సంస్థ ఆయుర్వేద వైద్య విద్యార్థుల్లో పరిశోధనపై అవగాహన పెంచి ప్రోత్సహించడానికి స్పార్క్(స్టూడెంట్‌షిప్ ప్రోగ్రామ్ ఫర్ ఆయుర్వేద రీసెర్చి కెన్) అనే పరిశోధన ప్రాజెక్టును 2022వ సంవత్సరంలో ప్రారంభించింది. దేశం మొత్తంలో 100 మంది విద్యార్థులను వారి పరిశోధన ప్రాజెక్టుల ఆధారంగా గుర్తించి ప్రోత్సహించింది. ఇందులో ఎస్వీ ఆయుర్వేద కళాశాల విద్యార్థి శ్రీకర్ భరద్వాజ చోటు దక్కించుకున్నారు. ఈ విద్యార్థి "వాతరక్తం అనే వ్యాధిలో వాసాదిక్వాథం ఏరండ బీజ లేపము, క్షీరసేకం అనే ఆయుర్వేద ప్రక్రియల ప్రయోజనం" అనే అంశంపై కాయ చికిత్స ప్రొఫెసర్ డాక్టర్ జ్ఞానప్రసూన పర్యవేక్షణలో చేసిన ఆయుర్వేద పరిశోధనకు ఉత్తమ పరిశోధనగా గుర్తింపు లభించింది. ఇందుకు గాను సిసిఆర్ఎఎస్ సంస్థ రూ.50 వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరం, ప్రొఫెసర్ జ్ఞానప్రసూన పాల్గొన్నారు.

పట్టాదారు పుస్తకాల్లో రెవెన్యూ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఓజిలి

రైతు పట్టాదారు పాస్ పుస్తకాల సవరణలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూముల రీ సర్వే పనుల్లో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలు సవరణలో ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు, మతి చెందిన వ్యక్తులపై పాస్ పుస్తకాలను మంజూరు చేసి ముప్పు తిప్పలు పెడుతున్నారని వాపోతున్నారు.

ఓజిలి మండలంలోని తిరుమలపూడి గ్రామంలో ఇటీవల నిర్వహించిన భూ రీ సర్వే పనుల్లో భాగంగా సుమారుగా మూడు వందల మంది రైతుల భూములను రీ సర్వే నిర్వహించారు. అధికారులు నూతన పాస్ పుస్తకాలు నమోదులో అన్నీ తప్పిదాలు ఉన్నట్లు రైతులు రెవెన్యూ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తిరుమలపూడి గ్రామానికి చెందిన

కొంతమంది రైతులు సోమవారం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రాన్ని అందజేశారు. నూతన పాస్ పుస్తకాల్లో తప్పిదాలు కారణంగా రైతులు పలు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని, వీటిని సవరించి తప్పిదాలు లేకుండా నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను మంజూరు చేయాలని , లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ దష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని రైతులు తెలియజేశారు. ఈ విషయమై తహశీల్దార్ స్పందిస్తూ సర్వే లెక్కల్లో తేడా ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బిఎన్ కండ్రిగ : మండలంలోని ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు తహశీల్దారు భార్గవి ఆదేశాలతో వీఆర్ఏ రంగయ్య సోమవారం పట్టుకుని, తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని కాళంగి నదిలో ఇసుక రీచ్లు లేవన్నారు. అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజాఫిర్యాదులు మళ్లీమళ్లీ రాకూడదు : కమిషనర్

తిరుపతి టౌన్ : నగరపాలక సంస్థకు డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలకు వస్తున్న ఫిర్యాదులు రిపీట్ కాకుండా సకాలంలో పరిష్కరించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో కమిషనర్ హరిత అర్జీలను స్వీకరించగా, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పాల్గొన్నారు. మున్సిపల్ గెస్ట్‌హౌస్ కేసులో కార్పొరేషన్‌కు తీర్పు అనుకూలంగా వచ్చినా ఇంకా ఎందుకు స్వాధీనం చేసుకోలేదన్నారు. కమిషనర్‌కు 19 ఫిర్యాదులు, స్పందనకు 20 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

వినాయక సాగర్ పనులు పూర్తి చేయండి

నగరంలో రూపుదిద్దుకుంట్టున్న వినాయకసాగర్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. వినాయకసాగర్ వద్ద జరుగుతున్న అభివద్ధి పనులను శనివారం సాయంత్రం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత పరిశీలించారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చిదిద్దుతున్న వినాయక సాగర్ పనులను వేగవంతం చేయాలన్నారు. సందర్శకులను ఆకర్షించే విధంగా స్వాగత ఆర్చ్ ఏర్పాటు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, డిఈ విజయ్ కుమార్ రెడ్డి, ఏయికామ్ ప్రతినిధి భాలాజీ పాల్గొన్నారు.

సిఎంను కలిసిన సునీల్ చక్రవర్తి

తిరుపతి టౌన్ : సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నగరి పర్యటన సందర్భంగా తిరుగు ప్రయాణంలో రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర రవాణా శాఖా సభ్యులు ఎం.సునీల్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిసారు.

ఘనంగా ఏఎంసీ ఛైర్మన్ మధు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జ్ఞానమ్మ వారి మధు రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వన్ని రెడ్డి జాగతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లెంభాకం ముని కష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పెళ్లి మండపం వద్ద కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. అనంతరం సుమారు 500 మంది పేదలకు అన్నదానం చేశారు.కష్ణారెడ్డి, మప్పేటి సుబ్రహ్మణ్యం రెడ్డి, సాయి రెడ్డి, జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆషా సంస్థ'లో ఈక్షిత జన్మదిన వేడుకలు

రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయం మార్గంలోని అక్షయ క్షేత్రంలో సోమవారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మునీశ్వర్ రెడ్డి, హరిత దంపతుల కుమార్తె ఈక్షిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్షయ క్షేత్రంలోని మానసిక వికలాంగుల మధ్య ఈక్షిత కేక్ కట్ చేశారు. అందరికీ అరటిపండ్లు, కేక్ స్నాక్స్ ను పంచిపెట్టారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ ముందుగా చిన్నారి ఈక్షిత కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఐఓబి బ్యాంక్ ఉద్యోగిని హరిత తన కుమార్తె జన్మదినం సందర్భంగా ఏదో ఒక సేవా కార్యక్రమం చేయాలని కోరడంతో అక్షయక్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు.

మంత్రి మెరుగు నాగార్జునకు ఘన స్వాగతం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం తిరుపతికి వచ్చిన సాంఘిక సంక్షేమ మంత్రి మెరుగు నాగార్జునకు క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ వై.ప్రవీణ్ ఘన స్వాగతం పలికారు. తిరుపతి విమానాశ్రయం చేరుకున్న మంత్రికి ఆయన శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్మ ఇండస్ట్రీ అధినేత కిషోర్ కుమార్, ఒలంపిక్ జిల్లా కార్యదర్శి శ్రీధర్, మల్లారం మధు, తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కులన్నీ మహిళా హక్కులే..!

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం తరపున అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే. హైమావతి మహిళల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని కరకంబాడిలోని రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ ట్రస్ట్ లో సోమవారం నిర్వహించారు. సమాజంలోని మహిళల పట్ల ఉన్న అసమానతను, వివక్ష, హింస రూపుమాపాలంటే మహిళలకు చట్టాలపై అవగాహన చాలా అవసరం అని అన్నారు. ఒక మహిళ తనకు తానుగా సాధికారత సాధించాలి అంటే తన హక్కులను సద్వినియోగ పరుచుకోవాలన్నారు. మానవహక్కులన్నీ మహిళా హక్కులన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ఫీల్డ్ కోఆర్డినేటర్ గిరిబాబు, అన్ బాలన్, మహిళా అధ్యయన కేంద్రం రీసర్చ్ అసిస్టెంట్ ప్రీతి పాల్గొన్నారు.

అసైన్మెంట్ భూముల పనులు పూర్తి చేయాలి : జేసీ

తిరుపతి టౌన్ : అసైన్మెంట్ ల్యాండ్ సంబంధించిన పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్.డి.ఓ. లు, తహశీల్దార్లు, సర్వేయర్లు, వి ఆర్ ఓ లతో రీసర్వే, విలేజ్ సర్వేర్ ల డేటా ఎంట్రీ, మ్యూటేషన్, అసైన్ మెంట్ ల్యాండ్స్, గ్రౌండ్ ట్రూ తింగ్ తదితర అంశాలపై వీడియో కన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సంధర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... అసైన్మెంట్ భూములకు సంబంధించిన తాసిల్దార్ లు ప్రత్యేక దష్టి పెట్టి పూర్తిచేసేలా చూడాలని తెలిపారు. రీ సర్వే రెండవ దశ ప్రక్రియలో భాగంగా 234 గ్రామాల్లో గాను 210 గ్రామాలలో పూర్తయిందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.డి. సర్వేయర్ జయరాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే టిడిపి రావాలి

రేణిగుంట : 'మీ ఆశీర్వాదం కోసం ఇంటింటికి మీ బొజ్జల' కార్యక్రమం లో భాగంగా సోమవారం రేణిగుంట మండలం, అత్తురు పంచాయతీ నందు శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ నారా చంద్రబాబునాయుడు రావాలన్నారు. ఆయన ప్రవేశపెట్టిన మినీ మ్యానిఫెస్టోను వివరించారు. అధ్యక్షులు మునిచంద్రారెడ్డి, బుజ్జినాయుడు పాల్గొన్నారు.

కొడుకును హత్య చేసిన తండ్రి అరెస్టు

ప్రజాశక్తి -దొరవారిసత్రం

మండల పరిధిలోని పడమటి కండ్రిగ గ్రామానికి చెందిన పుట్టమనాటి వెంకటకష్ణయ్య కొడుకు ప్రవర్తన పై విసుగు చెంది పథకం ప్రకారం కొడుకు వెంకటేష్(28) ను ఈనెల 24వ తేదీన రోకలి బండతో తలపై కొట్టి హత్య చేసిన విషయం విదితమే. వెంకటేష్ మద్యం సేవిస్తూ, నిత్యం డబ్బుల కోసం వేధించడంతో ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ముద్దాయి అయినటువంటి పుట్టుమనాటి వెంకటకష్ణయ్య(53)ను సోమవారం నాయుడుపేట రూరల్ సీఐ వై.వి సోమయ్య సమక్షంలో అరెస్టు చేశారు. సీఐ సోమయ్య, ఎస్సై తిరుమలరావు చాకచక్యంగా పట్టుకున్నందుకు వారిని నాయుడుపేట డిఎస్పి రాజగోపాల్ రెడ్డి అభినందించారు

నాయుడుపేటలో భారీ చోరీ

ప్రజాశక్తి- నాయుడుపేట

నాయుడుపేట పట్టణంలోని బాలాజీ గార్డెన్ లో ఆదివారం రాత్రి మూడు ఇళ్లలో భారీ చోరీ జరిగింది. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు తాళాల పగలగొట్టి ఇళ్లలో ప్రవేశించి బీరువాలు ఇతర ప్రాంతాల్లో ఉన్న బంగారు వెండి నగదును దోచుకెళ్లారు. అన్నమేడు హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న మధుసూదన్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 2 లక్షల రూపాయల నగదు, 15 సవర్ల బంగారం నగలు, చిట్టమూరు మండలం మొలకలపూడి పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ శ్రీనివాసులు ఇంటిలో 35 సవర్ల బంగారు నగలు, 3 కేజీల వెండి నగలు దోచుకెళ్ళారు. అలాగే కానిస్టేబుల్ చంద్ర ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న నగదు, బంగారు నగలు దోచుకెళ్లారు. కానిస్టేబుల్ చంద్ర ఇంట్లో పెద్దగా సొమ్మేమీ పోలేదని పదివేలు డబ్బులు, నాలుగు వెండి వస్తువులు మాత్రమే పోయాయని సీఐ కె.నరసింహారావు తెలిపారు. సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరీక్షించామని కొన్ని ఫింగర్ ప్రింట్స్ దొరికాయని అవి తిరుపతి ల్యాబ్ కు పంపించామని, పాత వాటితో పరిశీలించి ఈ దొంగతనానికి పాల్పడ్డ వాళ్ళు పాతవారో కొత్తవారో తెలుసుకుని వారంలో కేసు ఛేదిస్తామని తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడు సస్పెండ్

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న కీచక ఉపాధ్యాయుని విద్యార్థులు దేహశుద్ధి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు అందించిన వివరాల మేరకు వరదయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ సబ్జెక్టు ఉపాధ్యాయుడు అంకిరెడ్డి గత కొంతకాలంగా విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, తన తీరుని మార్చుకోవాలని పలుమార్లు తోటి ఉపాధ్యాయులు , విద్యార్థులు సూచించిన మార్పు రాకపోగా శనివారం రోజు ఇద్దరు విద్యార్థులతో తప్పుగా వ్యవహరించడంతో అది గమనించిన తోటి విద్యార్థులు కీచక ఉపాధ్యాయుని దేహ శుద్ధి చేశారు. అనంతరం ఆ ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేయాలని పోలీస్ కేసు పెట్టడానికి స్థానిక పోలీస్ స్టేషన్ కి వెళ్లినట్టు సమాచారం. ప్రధానోపాధ్యాయులు స్థానిక ఎస్సై నాగార్జున రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆదివారం ఈ విషయంపై చర్చించాలని కోరగా విద్యార్థులు వెను దిరిగి వెళ్లారు. విషయం తెలుసుకున్న డీఈఓ కీచక ఉపాధ్యాయుని సస్పెండ్ చేశారు. ఇకపై ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ప్రధాన ఉపాధ్యాయులు తెలిపారు. ఇలాంటి ఉపాధ్యాయులని కఠినంగా శిక్షించాలని విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు కోరుతున్నారు